క్లుప్తంగా

వైభవంగా శివ పార్వతుల విగ్రహ ప్రతిష్ట



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

పామూరు: మండలంలోని గోపాలపురంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మహాశివుడు, పార్వతిదేవి విగ్రహ ప్రతిష్ట సోమవారం రుత్వికులు చిమట కార్తీక్ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠించనున్న విగ్రహమూర్తులకు ముందుగా విశిష్ట పూజలు చేశారు. అనంతరం శివ, పార్వతి, మహాగణపతి, సుబ్రమణ్యేశ్వర, అయ్యప్ప, నవగ్రహ విగ్రహమూర్తులను ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక వేదికపై శివ, పార్వతుల పంచలోహ విగ్రహ మూర్తులకు శాంతి కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

20న మండల సమావేశం

కొండపి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమీక్ష సమావేశం నిర్వహించి, పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామని, సమీక్ష సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికతో సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలన్నారు.

22న మర్రిపూడి మండలం..

మర్రిపూడి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 22న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.25 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,25,512 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్ నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.52,190, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.22,410, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.34,364, పంచామృతాభిషేకానికి విరాళంగా రూ.16,548 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్య వివాహాల నష్టాలు వివరిస్తున్న అధికారులు

టంగుటూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీఓ మల్లేశ్వరి అన్నారు. స్థానిక బుడబుక్కల కాలనీలో బాల్య వివాహం జరుగుతుందని స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ కుమారి, ఐసీడీఎస్ సీడీపీఓ మల్లీశ్వరి ఆ ప్రాంతానికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన తరువాతే బాలికకు వివాహం చేయాలన్నారు. బాల్య వివాహం వల్ల నష్టాల గురించి వివరించారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెంలో అక్రమంగా మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న వడ్లమూడి అనిల్‌ను సోమవారం అదుపులోనికి తీసుకుని అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ఎక్కడి పనులు అక్కడే గప్‌చుప్

- ప్రభుత్వ పాఠశాలల్లో నిలిచిన నాడు–నేడు పనులు
- పట్టించుకోని ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ
- ప్రభుత్వ పాఠశాలలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం



పనులు ఆగిన ముప్పళ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముఖద్వారం

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. ఏళ్ల తరబడి కనీస వసతులు కరువైన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాడు–నేడు పేరుతో పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు విడుదల చేశారు. ఆ నిధులతో చాలా పాఠశాలల్లో రూపురేఖలు మారిపోయాయి. రెండో విడత కింద నాడు–నేడు కింద పాఠశాలలను ఎంపిక చేసి నిధులు సైతం మంజూరు చేశారు. ఆ పనులు సాగుతుండగానే ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాడు–నేడు పనులపై కక్ష కట్టింది. కూటమి ప్రభుత్వం ఈ 8 నెలల పాలనలో ఒక్కసారి కూడా ఈ పనుల గురించి పట్టించుకోలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అసలు ఆ పనులు తిరిగి ప్రారంభమవుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

ఆగిన పనులు

మండలంలో నాడు–నేడు రెండో విడతలో 9 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ పాఠశాలల్లో పనులు గతంలో ముమ్మరంగా సాగాయి. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు నిలిచిపోయాయి. మండలంలోని సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముప్పళ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందనవనం, నీలకంఠాపురం, తిమ్మారెడ్డిపల్లి, నందనవనం ప్రాథమిక పాఠశాలల్లో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బిల్లులు మంజూరు చేయరన్న భయంతో కాంట్రాక్టర్లు పనులు చేయకుండా చేతులెత్తేశారు. కానీ కూటమి ప్రభుత్వం ఏనాడు ఈ పనుల గురించి పట్టించుకోలేదు. చాలా పాఠశాలల్లో పనులు చివరి దశలో ఉన్నాయి. కానీ ఆ చిన్నపాటి పనులు పూర్తి చేసినా వాటిని వినియోగంలోకి తీసుకురావచ్చు. కానీ కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు ఆ దిశగా దృష్టి సారించలేదు.

చాలా పాఠశాలల్లో అదనపుతరగతి గదుల నిర్మాణం ఆగిపోవడంతో చాలీచాలని గదుల్లోనే ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభించి వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు.

బర్డ్‌ఫ్లూపై ఆందోళన వద్దు



పరుచూరివారిపాలెంలో కోళ్ల ఫారంను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి శివరామకృష్ణ

పొన్నలూరు: కోళ్లకు సంక్రమించే బర్డ్ ఫ్లూ వ్యాధి వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చౌటపాలెం పశు వైద్యాధికారి శివరామకృష్ణ అన్నారు. మండలంలోని పరుచూరివారిపాలెంలో ఉన్న బ్రాయిలర్ కోళ్ల ఫారాన్ని సోమవారం సందర్శించి యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడ కూడా బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని ప్రజలు వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దన్నారు. కోళ్లను పెంచే వారు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉన్నందున వ్యాధి తీవ్రత తగ్గే వరకు ఆయా జిల్లాల నుంచి కోళ్లను దిగుమతి చేసుకోవద్దన్నారు. బయో సెక్యూరిటీ పద్ధతులను పాటించడం వల్ల కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకకుండా అరికట్టవచ్చన్నారు. అలాగే కోళ్లకు టీకాలు, యాంటిబయోటిక్ మందులను వాడాటం వల్ల వ్యాధిని నివారించవచ్చన్నారు.

బాలికల వసతి గృహానికి భూమిపూజ

పామూరు: స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో రూ.194.21 లక్షల సమగ్రశిక్ష నిధులతో నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల బాలికల వసతిగృహం నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్టల్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సర్వశిక్ష ఈఈ యం.మన్నయ్య, ఏఈ ప్రకాష్, యారవ శ్రీనివాసులు, ఉప్పలపాటి హరిబాబు, బొల్లా నరసింహారావు, పువ్వాడి రామారావు, కె.వి.రమణయ్య, డి.వి.మనోహర్, పందిటి హరీష్, సయ్యద్ అమీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ లేకుండా అర్జీలు పరిష్కరించాలి

- ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి

హనుమంతునిపాడు: రెవెన్యూ సదస్సులకు వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులు, పెండింగ్ ఫైల్స్ పరిశీలించారు. ఇటీవల జరిగిన గ్రామసభకు ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారో అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సుకు 266 అర్జీలు రాగా 147 అర్జీలు పరిష్కరించామన్నారు. ఇంకా 125 అర్జీలు పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. పరిష్కారం కాని అర్జీలు త్వరతగతిన గ్రామాలకు వెళ్లి అర్జీదారునితో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, వీఆర్‌ఓకు సూచించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలు కూడా త్వరితగతిన పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, డీటీ కె.కిషోర్‌రెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వరుస చోరీలతో రైతు బెంబేలు



మోటార్, వైర్ చోరీకి గురికాగా ఖాళీగా ఉన్న డీప్‌బోరు

పామూరు: డీప్‌బోరు మోటార్, కేబుల్ చోరీకి గురైన ఘటన మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలోని పొలాల్లో సోమవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే..వెంకటాపురానికి చెందిన రైతు వీరంరెడ్డి మస్తాన్‌రెడ్డి ఉదయం తన పైరుకు నీరు వేసేందుకు పొలంలోని బోరు దగ్గరకు వెళ్లగా అక్కడ డీప్‌బోరు వద్ద పైపులు కోసి మోటార్, కేబుల్ చోరీకి గురై ఉండటాన్ని గమనించాడు. ఇదే రైతుకు చెందిన పొలంలోని మరో డీప్‌బోరులోని కేబుల్, మోటార్ ఈనెల 12వ తేదీన చోరీకి గురయ్యాయి. ఎవరైనా కావాలనే చేస్తున్నారా లేక దొంగల పనా అర్థం కాక రైతు మన్తాన్‌రెడ్డి తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. ఘటనపై సోమవారం పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదుచేసినట్లు రైతు తెలిపారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి 9 నెలలైనా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయలేదని మండిపడ్డారు. కుంటిసాకులు, మోసపు మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి ఎందుకు ఓటు వేశామని బాధపడుతున్నారన్నారు. ఇప్పటికైనా పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్ ప్రతులు దహనం



బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న నేతలు

కొండపి: గ్రామీణ పేదలను, వ్యవసాయ రంగాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ మండలంలోని పెరిదేపిలో సోమవారం బడ్జెట్ ప్రతులను వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్ మాట్లాడుతూ 50 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో 70 శాతానికి పైగా ఉన్న గ్రామీణ ప్రాంతాన్ని, వ్యవసాయ రంగాన్ని విస్మరించారని విమర్శించారు. ఆరోగ్య రంగానికి కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవన్నారు. ఈ నెల 24న రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుందని, అందులో సూపర్ సిక్స్ పథకాల అమలుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 20న జరిగే ఆందోళనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, మునేంద్ర, సునంద, సుజాత, మార్తమ్మ, ఆశీర్వాదం పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు

పొన్నలూరు: మండలంలోని పొన్నలూరు నుంచి ఉప్పలదిన్నె, రావులకొల్లు, కామేపల్లె గ్రామాలకు వెళ్లే రహదారికి ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్లను ఎస్సై అనూక్ చొరవ తీసుకొని సోమవారం పొక్లెయిన్‌తో తొలగించారు. ఈ రహదారిపై ప్రయాణం చేసేటప్పుడు ఎదురుగా వాహనం వస్తే చెట్లు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా ఉండటంతో పక్కకు తొలగే మార్గం లేదు. దీంతో రాత్రి సమయంలో ఇటీవల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎస్సై అనూక్ చొరవ తీసుకొని రోడ్డుకు ఇరువైపులా 5 కి.మీ మేర చెట్లను తొలగించి సమస్యను పరిష్కరించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

కొండపి: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండలంలోని నేతివారిపాలెం గ్రామానికి చెందిన దివి వెంకటేశ్వర్లుకు కట్టవారిపాలెం గ్రామానికి చెందిన ఆరికట్ల భార్గవితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అయితే అదనపు కట్నం కోసం వెంకటేశ్వర్లు, అతని తల్లిదండ్రులు వేధిస్తున్నారు. దీంతో సోమవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నివేశన స్థలాల మంజూరులో నిర్లక్ష్యం



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

సీఎస్‌పురం(పామూరు): నిలువనీడలేని పేదలకు నివేశనా స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివేశనాస్థలాలకోసం ఏళ్ల తరబడి పేదలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. అన్యాక్రాంతమవుతున్న భూములను కాపాడలేని పాలకులు, అధికారులు పేదలపై మాత్రం జులుం ప్రదర్శిస్తున్నారన్నారు. అర్హులైన పేదలందరికీ నివేశనాస్థలం ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని తహసీల్దార్ మంజునాథరెడ్డికి అందజేశారు. జి.లక్ష్మయ్య, పి.అన్నయ్య, పి.తిరుపతమ్మ, ఎన్.నాగమ్మ, ఐద్వా జిల్లా సహాయకార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, సీఐటీయూ సీహెచ్ అంకమరావు, కొండలరావు, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కొండపిలో సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కొండపి: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచి గ్రాట్యుటీ అమలు చేయాలని కోరుతూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ జిల్లా యూనియన్ అధ్యక్షురాలు వై.సత్యవతి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీఓ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడెన్స్ రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కొండపి ప్రాజెక్టు అధ్యక్షురాలు పోలమ్మ, పొన్నలూరు మండలం నాయకురాలు పద్మ, రామలక్ష్మి, హైమావతి, వెంకటరమణ పాల్గొన్నారు.

టంగుటూరు: అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షురాలు పి.క్రాంతి అధ్యక్షత వహించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకుంటే రానున్న రోజుల్లో ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. కె.హేమలత, సుభాషిణి, కృష్ణవేణి, కాత్యాయిని, ప్రసన్న, శకుంతల, లక్ష్మి, పద్మ, విజయ, యశోద, వరమ్మ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

హనుమంతునిపాడు: వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు డాక్టర్ సందీప్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థులు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

సింగరాయకొండ: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం రాత్రి సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి, నాగులుప్పలపాడు మండలాల తహసీల్దార్లతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం జేసీ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 16,808 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో 853 అర్జీలు జీరో ఖాతాలు, సర్వే నంబర్ పోర్టింగ్, భూముల కొలతల్లో తేడాలు, వివాదాస్పద భూముల రిజిష్టర్‌లో మార్పులు, చేర్పులు వంటి 7 రకాల సమస్యలను జేసీ లాగిన్‌లో మాత్రమే చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఒక్కో డివిజన్‌లో ఒక్కోరోజు నాలుగు మండలాల చొప్పున సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు లో 108 సర్వే నంబర్‌లో సాంకేతిక కారణాల కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచాయని ఈ సమస్య పరిష్కారానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించారన్నారు. మండలంలో 17 అర్జీలు రాగా అందులో 14 దేవాదాయశాఖకు సంబంధించినవన్నారు. పాతసింగరాయకొండ పంచాయతీకి సంబంధించి 22.85 ఎకరాల ప్రైవేటు భూములు దేవాదాయశాఖ పరిధిలో ఉన్నట్లు రికార్డుల్లో ఉందని, వాటిని తన లాగిన్ ద్వారా ప్రైవేటు భూములుగా మార్పు చేశామన్నారు. జరుగుమల్లి మండలం కామేపల్లిలో 49 ఎకరాల పాతసింగరాయకొండ వరాహాలక్ష్మీనరశింహాస్వామి దేవస్థానం భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వటానికి ఆమోదం తెలిపినట్లు వివరించారు. టంగుటూరు, నాగులుప్పలపాడు మండలాల సమస్యలు పరిష్కరించినట్లు ఆయన వివరించారు. ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న, తహశీల్దార్లు టి.రవి, బి.జనార్దన్, ఆంజనేయులు, ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రతి రైతు తన వివరాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందాలని, అప్పుడే ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందని ఏఓ పి.యుగంధర్‌రెడ్డి అన్నారు. జరుగుమల్లి మండలంలోని అక్కచెరువుపాలెం, చిర్రికూరపాడు, చతుకుపాడు, తూమాడు గ్రామాల్లోని రైతు సహాయ కేంద్రాల్లో జరుగుతున్న రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఏఓ యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందితే తప్ప రైతు భరోసా, సబ్సిడీ పథకాలు, ఇతర ప్రభుత్వ లబ్ధి పొందే అవకాశం లేదని వివరించారు. మండలంలో ఇప్పటివరకు 2,124 మంది రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. ఏఈఓ శ్రీలేఖ, రైతులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ, సీపీఎం నేతలు

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): నడికుడి రైల్వే లైన్ కింద గృహాలు నష్టపోయే వారికి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి బాధితులతో కలిసి సోమవారం ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు శేషయ్య, బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాధితులకు వెంటనే పరిహారం మంజూరు చేయాలన్నారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

పామూరు: వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించే వాహనాన్ని నడపాలని సీఐ భీమానాయక్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం మండలంలోని పెట్రోల్, డీజిల్‌బంక్ యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పెట్రోల్, డీజిల్‌బంక్‌ల వద్ద నో హెల్మెట్ నో పెట్రోల్ బోర్డులు పెట్టాలని సూచించారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని, ముఖ్యంగా యువత విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై టి.కిషోర్‌బాబు, పెట్రోల్, డీజిల్‌బంక్‌ల యజమానులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తాం

సింగరాయకొండ: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో యూనియన్ బ్యాంక్ పనిచేస్తుందని బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.రవి కుమార్ అన్నారు. స్థానిక డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి హాస్పిటల్ సమీపంలో సోమవారం యూనియన్ బ్యాంకు నూతన భవన ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. డీజీఎం రవికుమార్ మాట్లాడుతూ ఖాతాదారుల సౌకర్యం కోసం అదనపు సిబ్బందిని నియమించామన్నారు. బ్యాంకు ఏజీఎంలు రామలింగేశ్వరరావు, శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ రాజీవ్ చక్రవర్తి, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, ఖాతాదారులు శీలం చంటి, కాకా శ్రీను, కొత్తూరి శ్రీ రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భైరవకోనలో అభివృద్ధి పనుల పరిశీలన

సీఎస్‌పురం(పామూరు): మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో తలపెట్టిన పనులను సోమవారం ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాశివరాత్రికి భక్తులకు వసతుల కల్పనకు కృషిచేస్తున్నట్లు తెలిపారు.